మూడేళ్లుగా అందని తాగునీరు

'డబుల్' ఇళ్ల వద్ద మంచినీటి సరఫరా లేక అవస్థలు

- ట్యాంకర్లు, ఆటోల ద్వారా కొనుగోలు
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు



రైతుబజార్ సమీపంలోని డబుల్ బెడ్రూం ఇళ్లు

మీర్‌పేట: మూడేళ్లవుతున్నా డబుల్ బెడ్రూం ఇళ్ల సముదాయం వద్ద మంచినీటి సదుపాయానికి నోచుకోకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.మంచినీటికి ప్రైవేట్ ట్యాంకర్లను ఆశ్రయిస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. అయినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు స్పందించి మంచి నీటి వసతి కల్పించాలని డబుల్ ఇళ్ల ప్రజలు కోరుతున్నారు. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 2021 సంవత్సరం డిసెంబరులో అప్పటి ప్రభుత్వం 29వ డివిజన్ రైతుబజార్ వద్ద గుడిసెలు వేసుకొని జీవిస్తున్న పేద ప్రజల కోసం డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇచ్చింది. 5 బ్లాకులు ఉండగా ప్రతీ బ్లాకులో 16 కుటుంబాల చొప్పున మొత్తం 80 వరకు కుటుంబాలు ప్రస్తుతం నివాసముంటున్నాయి. డబుల్ ఇళ్లకు వాటర్ లైన్ వేసి కనెక్షన్‌లు ఇవ్వడానికి రూ.33 లక్షల వ్యయం అవుతుందని జలమండలి శాఖ వారు గతంలోనే చెప్పడంతో కార్పొరేషన్‌లో అంత పెద్ద మొత్తంలో ఆదాయం లేకపోవడంతో నేటికీ మంచినీటి సమస్య పరిష్కారానికి నోచుకోకపోవడం గమనార్హం.

ట్యాంకర్ల ద్వారా..

డబుల్ ఇళ్లలోకి వచ్చినప్పటి నుంచి మంచినీటి సౌకర్యం లేకపోవడంతో ప్రైవేట్ ట్యాంకర్లు, ఆటోలకు వందలాది రూపాయలు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇక్కడ నివాసముండేది అంతా నిరుపేద కుటుంబాలేనని, డబ్బులు వెచ్చించి నీటిని కొనుగోలు చేయాలంటే ఆర్థికంగా భారం పెరిగిపోతుందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకుని 3వ అంతస్తు వరకు మోసుకెళ్లాల్సి వస్తోందని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రభుత్వం స్పందించి డబుల్ బెడ్రూం ఇళ్లకు నల్లా కనెక్షన్‌లు ఇచ్చి నీటిని సరఫరా చేయాలని వేడుకుంటున్నారు.

పట్టించుకోవడం లేదు



మంచినీటి సదుపాయం లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. నల్లా కనెక్షన్‌ల కోసం గతంలో హౌసింగ్ బోర్డు అధికారులను కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. నీటిని కొనుగోలు చేయలేని వారు పక్క కాలనీలకు వెళ్లి మంచినీరు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించాలి.

– దండు సాలయ్య, స్థానికుడు

సహకార సంఘం ఉద్యోగికి సన్మానం



గణేశ్‌ను సన్మానిస్తున్న చైర్మన్ పాండు, వైస్ చైర్మన్ వెంకటేశ్వర్‌రెడ్డి

మహేశ్వరం: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్ష, శిక్షణల్లో ప్రతిభ కనబర్చిన మహేశ్వరం సహకార సంఘం కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగి ఎమ్మె గణేశ్‌ను సోమవారం పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు, వైస్ చైర్మన్ దేవరంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి, తోటి ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. భవిష్యత్‌లో మరిన్నీ శిక్షణ కార్యక్రమాలు చేపట్టి సొసైటీవారు నిర్వహించే పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని వారు కోరారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ ఎండీ.షఫీ, కో–ఆపరేటివ్ యూనియర్ హైదరాబాద్ ప్రిన్సిపాల్ భూక్య వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ కె.ప్రభాకర్, అసిస్టెంట్ సీఈఓ ఐలయ్య, తోటి ఉద్యోగులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి సన్మానం



రాజును సన్మానిస్తున్న మండల నాయకులు

మహేశ్వరం: కాంగ్రెస్ పార్టీ యువతకు పదవుల్లో అధిక ప్రాధాన్యత కల్పించి గౌరవిస్తుందని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లూరు రాజు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుక్కుగూడలోని కేఎల్లార్ క్యాంపు కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన గొల్లూరు రాజును ఘనంగా సన్మానించి అభినందించారు. మండలంలో పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం మాజీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎర్రవాపు ఇజ్రాయేల్, కాకి ఈశ్వర్‌ముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, ఆవుల యాదయ్య, చాకలి యాదయ్య, కూన యాదయ్య, మురళీధర్‌రెడ్డి, హరినాథ్‌గౌడ్, పెంద్యాల బాల్‌రాజ్, ఏర్పుల శ్రీశైలం, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభం



పహాడీషరీఫ్: జల్‌పల్లిలో సర్వే నిర్వహిస్తున్న అధికారులు



తుక్కుగూడ: సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వాణి

పహాడీషరీఫ్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అర్హులను గుర్తించేందుకు జల్‌పల్లి మున్సిపాలిటీ అధికారులు సోమవారం సర్వే ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ పర్యవేక్షణలో సిబ్బంది ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న ఫారంల ఆధారంగా ఆయా ఇళ్లను సర్వే చేశారు. ఖాళీ స్థలం, రేకుల ఇళ్లు, శిథిలావస్థకు చేరుకున్న దశలో ఉన్న వాటిని పరిగణనలోకి తీసుకున్నారు. ఇలా మున్సిపాలిటీ మొత్తంగా ప్రజాపాలనలో దాదాపు 16 వేల దరఖాస్తులు అందాయని అధికారులు వెల్లడించారు. దరఖాస్తుదారుల వద్ద ఇళ్లకు సంబంధించిన స్థల పత్రాలను కూడా ఈ సందర్భంగా అధికారులు పరిశీలించారు. హౌజింగ్ బోర్డు అధికారులు కూడా ఈ సర్వే సరళిని పరిశీలించారు. జల్‌పల్లిలోని 16వ వార్డు వీకర్ సెక్షన్ కాలనీలో స్థానిక కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, అధికారులు చేపట్టిన సర్వేలో తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో పూర్తి వివరాలు సేకరించాలి: మున్సిపల్ కమిషనర్ వాణి

తుక్కుగూడ: ఇందిరమ్మ ఇళ్ల సర్వే చేస్తున్న అధికారులు ప్రజల నుంచి పూర్తి వివరాలను సేకరించాలని మున్సిపల్ కమిషనర్ ఏ.వాణి సూచించారు. తుక్కుగూడ మున్సిపాలిటీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే సోమవారం ప్రారంభమైంది. ఈ సర్వేను కమిషనర్‌ను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. సర్వే కోసం వార్డుకో అధికారిని నియమించామన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తుల ఆధారంగా సర్వే చేస్తున్నామని, ప్రజల నుంచి సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామన్నారు. తప్పులు లేకుండా, పూర్తి వివరాలను సేకరించాలన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మీర్‌పేటలో..

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధిలోని డివిజన్‌లలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభమైంది. జిల్లెలగూడ, అంబేడ్కర్‌నగర్ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ బైగళ్ల బాలమణితో కలిసి కమిషనర్ జ్ఞానేశ్వర్ సర్వేలో పాల్గొని అర్హుల ఇళ్ల వద్దకు స్వయంగా వెళ్లి వివరాలను నమోదు చేశారు. పథకం వివరాలను తెలియజేయడంతో పాటు సర్వే కోసం వచ్చే సిబ్బందికి పూర్తి వివరాలు తెలపాలని ఈ సందర్భంగా వారు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు డీఈ బిక్కునాయక్, ఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వే ఇన్‌చార్జి భాస్కర్, కాలనీ అధ్యక్షుడు ఓంప్రకాశ్‌లు పాల్గొన్నారు.

బడుగుల సంక్షేమమే ధ్యేయం

- మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్



మహేశ్వరం: కేఎల్లార్‌తో పార్టీలో చేరిన నాయకులు

మహేశ్వరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని ఉప్పుగడ్డ తండా, కొత్త తండాలకు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కేతావత్ రాజునాయక్‌తో పాటు అతని అనుచరులు కాంగ్రెస్ పార్టీ మండల మాజీ ఎస్టీ సెల్ అధ్యక్షుడు నేనావత్ రాజునాయక్ ఆధ్వర్యంలో కేఎల్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు పార్టీలో చేరుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తుందన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో మహేశ్వరం, కందుకూరు మండలాల్లో మెజార్టీ సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ కై వసం చేసుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారిలో కేతావత్ రవినాయక్, మోహన్‌నాయక్, రవినాయక్ ఎం. రాజునాయక్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నేనావత్ రాజునాయక్, నేనావత్ రాజ్‌కుమార్‌నాయక్, శ్రీనివాస్‌నాయక్, రవినాయక్, భరత్ నాయక్, సూర్యనాయక్, రవినాయక్ పలువురు పాల్గొన్నారు.

భూపంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

తుక్కుగూడ: దేశంలో దళితులకు అసైన్డ్, సీలింగ్ భూములను పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేఎల్లార్ అన్నారు. సోమవారం తుక్కుగూడ మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్సీ సెల్ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా క్యారగారి శ్రీధర్‌ను నియమించారు. అనంతరం ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతంతో పాటు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వరుణ్ రెడ్డి, నాయకులు వల్లపు సుభాన్ యాదవ్, కొంతం సందీప్, గోల్లూరి రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

షాద్‌నగర్: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుకోవాలని తద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో ఆదివారం రాత్రి అయ్యప్ప స్వామి మహా పడి పూజ ఘనంగా నిర్వహించారు. గురుస్వామి గిరిషన్‌నాయర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్ధరాత్రి పడివందనం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కన్యస్వాములతో పరిగి రోడ్డులోని పోచమ్మ దేవాలయం నుంచి శివ మారుతీ గీతా అయ్యప్ప మందిరం వరకు మహాదీపారాధనతో ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో కేరళ మేళతాళాలు, వాయిద్యం, ఆటాపాటలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

సమస్యలు పరిష్కరించాలని వినతి

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో అన్ని రంగాల్లో వెనుకబడిన మాదాసి, మాదారి కురువల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆ సంఘం తాలుకా అధ్యక్షుడు వితలయ్య డిమాండ్ చేశారు. సోమవారం మాదాసి, మాదారి కురువలను ఎస్సీ వర్గీకరణలో భాగంగా ఏ జాబితాలో చేర్చాలని కోరుతూ సంఘం నాయకులు ఏక సభ్య విచారణ కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీం అక్తర్‌ను సచివాలయంలో కలిసి వినతిపత్రం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వితలయ్య మాట్లాడుతూ.. సామాజిక, ఆర్థిక, వెనుకబాటు కారణంగా విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో మాదాసి కురువలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా తమను ఏ జాబితాలో చేర్చే విధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. వినతిపత్రాన్ని అందజేసిన వారిలో సంఘం నాయకులు శివరాములు, లక్ష్మయ్య, నర్సింలు, బాల్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్లిన, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం చౌదరిగూడ స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం సునిత ఆధ్వర్యంలో కాంప్లెక్స్ పరిధిలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన 21 మంది ఉపాధ్యాయులకు సోమవారం ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చౌదరిగూడ ఉన్నత పాఠశాలలో వారికి శాలువా, పూలమాలలతో సన్మానించారు. అదేవిధంగా నూతనంగా బదిలీపై వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికి సత్కరించారు. కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఎంఈఓ కిష్టారెడ్డి, చౌదరిగూడ పీఎస్ హెచ్ఎం నీలా మోహన్‌నాయక్‌తో పాటు వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే లక్ష్యం

కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అంద్రూ



మాట్లాడుతున్న నాయకులు

మొయినాబాద్‌రూరల్: ప్రజా శ్రేయస్సే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జిల్లా నాయకుడు అంద్రూ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఆయన కాంగ్రెస్ నాయకుడు, కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు సంగరి మల్లేశ్, మాజీ కో–ఆప్షన్ సభ్యుడు మక్బూల్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆంద్రూ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తూ సంక్షేమ హాస్టళ్లలో డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలం నుంచి ఎస్సీ రిజర్వేషన్ అవకాశం వస్తే జెడ్పీటీసీగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ రాజర్షిషా

షాద్‌నగర్: అదిలాబాద్‌లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో షాద్‌నగర్‌లోని ఠాగూర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల డైరెక్టర్ రవిప్రకాశ్ హర్మాల్ తెలిపారు. 31 జిల్లాలకు చెందిన విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. ఠాగూర్ పాఠశాలకు చెందిన మహ్మద్ జోహెబ్ షరీక్, ఫైజల్, దెబాదిత్యలు పాల్గొని ప్రతిభ కనబర్చి ఆరో స్థానంలో నిలిచినట్లు తెలిపారు. విద్యార్థులను అదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా అభినందించారు. ఈసందర్భంగా పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు.

వసతి గృహాలకు భవనాలు నిర్మించాలి



ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా, వినతి

చేవెళ్ల: కళాశాల విద్యార్థులకు సంబంధించి మంజూరైన వసతి గృహాలకు సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్ కుమార్, శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో సోమవారం కళాశాల విద్యార్థులతో కలిసి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేవెళ్లలో 2018లో ఎస్సీ బాలికల, బాలుర వసతి గృహాలు మంజూరైనట్లు చెప్పారు. అప్పటి నుంచి వీటికి సొంత భవనాలు లేకపోవటంతో అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయని, అద్దె భవనాల్లో సౌకర్యాలు లేకపోవటంతో ఇటీవల పాఠశాల విద్యార్థులు ఉండే వసతి గృహంలోకి మార్చారన్నారు. అక్కడ పాఠశాల, కళాశాల విద్యార్థులకు గదులు, సౌకర్యాలు సరిపడకపోవటంతో మరింత ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు వెంటనే సొంత భవనాలు మంజూరు చేయించి నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ నాయకులు సమీర్, చందు, చరణ్‌గౌడ్, అనిల్‌కుమార్, నవీన్, సందీప్, ఆసిఫ్, శివ, కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి

నందిగామ: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి సూచించారు. మండల పరిధిలోని చేగూరులో సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహకారంతో భాస్కర లా కళాశాల ఆధ్వర్యంలో గ్రామస్తులకు చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జడ్జి శ్రీదేవి హాజరై మాట్లాడుతూ.. సమాజంలో నిత్యం జరుగుతున్న పలు సంఘటనలు, వాటి పర్యావసానాలు, చట్టాలు, కోర్టులు ఇచ్చే తీర్పులు, సెక్షన్లు తదితర వాటిపై అవగాహన అవసరమన్నారు. అంతేగాకుండా అనవసరమైన విషయాలలో జోక్యం చేసుకోవద్దని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడొద్దని సూచించారు. కార్యక్రమంలో లా కాలేజీ ప్రిన్సిపాల్ భగవద్గీత, పారా లీగల్ వలంటీర్లు సంజీవ, బాల్‌రెడ్డి, లా కాలేజీ అధ్యాపకులు అనిల్‌సింగ్, స్నేహలత, విజేత రాణి, హృషికేశ్, పటాన్‌ఖాన్, జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రాజురెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ధనుర్మాస వేడుకలు ప్రారంభం



ప్రత్యేకలంకరణలో లక్ష్మీనర్సింహస్వామి

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని జెన్నాయిగూడ ఛత్రగిరి లక్ష్మీనర్సింహస్వామి, శ్రీనగర్ ఆదిలక్ష్మి భూసమేత వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం ధనుర్మాస వేడుకలను వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలోని స్వామివార్లకు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. భక్తులు స్వామివార్లకు మొక్కులు, కానుకలు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్‌ల అందజేత



దివ్యాంగులకు బస్‌పాస్‌లు అందిస్తున్న నాయకులు

కందుకూరు: మండల పరిధిలోని నేదునూరు మాజీ ఉప సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జి.ప్రభాకర్‌రెడ్డి సొంత డబ్బులతో 80 మంది దివ్యాంగులకు సోమవారం ఆర్టీసీ బస్‌పాస్‌లను అందించారు. అనంతరం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలతో కలిసి మోడల్ స్కూల్ విద్యార్థినుల వసతి గృహాన్ని సందర్శించారు. వారికి అందుతున్న వసతులు, సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల కో–కోర్డినేటర్ ఎండీ అఫ్జల్‌బేగ్, చెన్నకేశస్వామి ఆలయ కమిటీ చైర్మన్ రూప్‌చందర్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు బొర్ర సురేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



పనులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ శంకర్, నాయకులు

పహాడీషరీఫ్: గడిచిన ఐదేళ్ల కాలంలో శ్రీరాం కాలనీలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామని జల్‌పల్లి మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ పల్లపు శంకర్ అన్నారు. రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి సహకారంతో కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు వేయించామన్నారు. మున్సిపాలిటీ అధికారులు పారిశుద్ధ్యం, ఇతర మెయింటెనెన్స్ పనులు ఎప్పటికప్పుడూ చేయాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు దూడల సుధాకర్‌గౌడ్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై విరిగిపడిన మర్రిచెట్టు కొమ్మ

చేవెళ్ల: హైదరాబాద్–బీజాపూర్ రహదారిపై ఉన్న మర్రిచెట్టు కొమ్మ రోడ్డుపై విరిగిపడి వాహనాదారులకు ప్రమాదకరంగా మారింది. ఇబ్రహీంపల్లి బస్‌స్టేజీకి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న ఓ మర్రిచెట్టుపై నుంచి పెద్ద కొమ్మ సోమవారం సాయంత్రం విరిగిపడింది. అది పూర్తిగా కిందపడిపోకుండా చెట్టుకు వేలాడుతూ రోడ్డుపై వెళ్లే వాహనాలకు ఇబ్బందిగా మారింది. ఈ విషయంపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించటంతో పోలీసులు వచ్చి దానిని తొలగించారు.

ఉచిత పశువైద్య శిబిరం

షాబాద్: పాడి పశువులకు వచ్చే వ్యాధులపై రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో పశువులకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 16 గేదెలకు గర్భకోశ వ్యాధి చికిత్సలు చేశారు. 25 గేదెలకు చూడు పరీక్షలు నిర్వహించి, దూడలకు, గేదెలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో పశువులకు వైద్యం అందిస్తే అధిక పాల దిగుబడి వస్తుందని తెలిపారు. మేలు రకం పశువుల ఎంపిక ద్వారా అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రైతులు వ్యవసాయంతో పాటు పాడిపరిశ్రమను అభివృద్ధి చేసుకుంటే మంచి లాభాలు వస్తాయన్నారు. పాడి పశువుల ఆరోగ్యంపై తగిన జాగ్రత్తలు, డాక్టర్ల సలహాలు తీసుకుని పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గోపాలమిత్ర విద్యాసాగర్, వైద్య సిబ్బంది శ్రీనివాస్, సుధాకర్, రైతులు తదితరులు ఉన్నారు.